# ఎవరు బాధ్యులు?

అపర్ణ ఆఫీసుకి వెళ్ళడానికి ముస్తాబయ్యింది. "ఇంకా తయారవ్వ లేదా అపూ! వేళయిపోతోంది. నేను నిన్ను డ్రాప్‌చేసి వెళ్లాలి కదా?" అనుకుంటూ వచ్చాడు చంద్రం.

"నేను రెడీయేనండి! ఎందుకోమరి, బాబుని యీ స్థితిలో వదిలి వెళ్ళడం, బాధనిపిస్తోందండి ..." అంది దిగులుగా.

చంద్రం అదోలా మొహం పెట్టాడు. "అబ్బ! నీతో యిదే చిక్కు అపర్ణా! బాబుకి యిప్పుడేమయ్యిందని? కాస్తంత జ్వరం .... అంతేకదా? హి విల్ బీ ఓకే. మందులు యిస్తున్నాం కదా? వేళ తప్పకండా రాణి యిస్తుందిలే."

అయినా, మాతృ హృదయం పూరడిల్లలేదు. ఆమె మనసు జివ్వున లాగుతూనే వుంది.

"మీకు తెలీదండీ నా అంతరంగంలోని బాధ! తల్లిగా నేననుభవిస్తున్న ఆరాటం, మీకు అర్థం కాదు" అంది మళ్ళీ అపర్ణ.

చంద్రం సూటిగ ఆమెకేసి చూశాడు.

"డోన్ట్ బీ సిల్లీ! తల్లిగా నీ ఒక్కర్తికేనా ఆరాటం? తండ్రిగా నాకు యెటువంటి ఆరాటమూ, ఆతృతా లేవంటావా."

"లేదని నేననడం లేదండీ! కాని, కన్న కడుపు నాది. అందుకే ఆతృత ఓ పాలు యెక్కువుంటుందండీ!"

"ఇట్సాల్ రైట్ టైమవుతోంది. రాణికి అన్నీ చెప్పి బైలుదేరు. లేకుంటే ఇద్దరమూ లేటవ్వాల్సి వస్తుంది" అంటూ బైటికి నడిచాడు చంద్రం.

అపర్ణ, బరువుగా ఓ నిశ్వాసం వదిలి మంచం మీదున్న కొడుకు దగ్గరికి వెళ్ళింది. రాణి, ఆమె ననుసరించింది.

"రాణీ, వీణ్ణి యీ పరిస్థితిలో వదిలి వెళ్ళడం, నాకు బాధగానే వుంది. కాని, యేం చెయ్యను? ఇవ్వాళ ఆఫీసులో ఇన్‌స్పెక్షను వుండటం వల్ల, వెళ్ళక తప్పడం లేదు. నువ్వు మాత్రం వీణ్ణి కంటికి రెప్పలా చూసుకోవాలి. ఇదిగో, యీ మాత్రలు ప్రతి రెండు గంటలకి ఒకటి చొప్పున యివ్వు. హార్లిక్స్ ఫ్లాస్కులో వుంది కదా? ద్రాక్షపళ్ళు తింటానంటే, యిదిగో మూతపెట్టి వుంచాను, అబ్బాయి నిద్రపోతున్నాడు. వాణ్ణి మేల్కొలపడం, నా కిష్టంలేదు. వెళ్లొస్తాను" అంటూ బయల్దేరింది అపర్ణ.

"మీరేం కంగారుపడకండి. నేనున్నానుగా.... వెళ్ళిరండి నిశ్చింతగా" అంది, రాణి.

అపర్ణ, ఓ నిట్టూర్పు వదుల్తూ, నిష్క్రమించింది. ఆమె మనసులో అబ్బాయిని గురించిన ఆరాటమే! కాని, యేమీ చెయ్యలేకపోతోంది. భర్తతోపాటు స్కూటర్ మీద వెళ్ళిపోయింది.

*　　　　*　　　　*

చంద్రం, ఆర్నెల్ల క్రితమే స్కూటర్ కొన్నాడు. ఆఫీసుకి వెళ్ళే ముందు, భార్యని ఆమె పని చేస్తోన్న ఆఫీసు దగ్గర డ్రాప్ చేసి, తన ఆఫీసుకి వెళ్తాడు చంద్రం. మళ్ళీ సాయంకాలం యింటికి తీసుకొస్తాడు.

ఇది అతని దినచర్య. నిజానికి స్కూటరు కొనడం కూడా అందుకే. లేకుంటే రిక్షాలకే బోలెడు ఖర్చు పెట్టాల్సి వస్తోంది మరి.

చంద్రం, అపర్ణ యిద్దరూ వుద్యోగాలకు పోతూ వుండటం వల్ల, రాణిని యింట్లో పెట్టుకున్నారు.

రాణి, అపర్ణకు దూరపు బంధువు. ఏ ఆధారమూ లేని ఓ వితంతువు. వయసు సుమారు ముప్పయ్యేళ్ళుంటాయి. నుదుట బొట్టు వుండదన్నమాటే గాని, ఆకర్షణీయంగానే అగుపిస్తుంది.

రాణి యెదురింట్లో ఓ గదిలో అద్దె కుంటోన్న రాముని ఆకర్షించింది. రాము అవివాహితుడు. హుషారుగా వుంటాడు. ఏదో ప్రయివేటు ఫర్మ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. షిఫ్టు డ్యూటీలు వుండడం వల్ల, సాధారణంగా పగటి పూట ఇంట్లోనే వుంటాడు. ఒంటరిగా వున్న రాణితో పరిచయం చేసుకున్నాడు. ఆ పరిచయం చిగురించి, ప్రేమగా పరిణమించింది. ఒకర్నొకరు విడిచిపెట్టి వుండలేనంతగా, వారి అనుబంధం పెరిగింది. అయితే, రాముని వివాహం చేసుకుందుకు సాహసించలేక పోతోంది, రాణి.

చంద్రం, అపర్ణ వెళ్ళిపోగానే రాము రాణి దగ్గరికి వచ్చేస్తాడు. కొద్ది నెలలుగా యీ వ్యవహారం సాగుతోంది.

* * *

ఆ రోజూ వచ్చేశాడు, రాము.

చిరునవ్వుతో ఆహ్వానించింది, రాణి. "హార్లిక్స్ తీసుకుంటావా?" చిన్నగా మందహాసం చేస్తూ అడిగింది రాణి.

'అడగడమేవింటి రాణీ? ఇచ్చేయడమే..." కిల కిలా నవ్వుతూ ఆమె చెక్కిలిపై చిటికె వేశాడు, రాము.

రాణి పక్క గదిలోకి పోయి హార్లిక్స్ తెచ్చి అందిస్తూ అంది.

"బాబు పక్క గదిలో పడుకున్నాడు. అతడికి యివ్వాల్సిన హార్లిక్స్ నువ్వు కొట్టేస్తున్నావు రోజూ...."

"అది నా అదృష్టం..."

ఇద్దరూ పక్క పక్కనే కూర్చున్నారు. పరిహాసా లాడుకుంటున్నారు.

"ద్రాక్షపళ్ళేవీ?" అడిగాడు, రాము.

రాణి, ద్రాక్షపళ్లు తెచ్చియిచ్చింది. "ఈ అబ్బాయికి అనారోగ్యంగా వుండటం, మనకి లాభించింది రాణీ" ఒక్కో పండు తింటూ, ఆమె కొక్కొక్కటి అందిస్తూ అన్నాడు, రాము.

"అదీ నిజమే! కాని, ఇంకెన్నాళ్ళు? బాబు ఆరోగ్యం కుదుటపడ్డాక, యిటువంటి అవకాశాలే వుండవు మరి! అంతే కాదు - మరో సంవత్సరం దాటితే, బాబుని యే బోర్డింగు స్కూల్లోనో వేస్తారట. అప్పుడు నన్ను యిక్కణ్ణించి పంపించేస్తారేమో!" సందేహాన్ని వెలిబుచ్చింది, రాణి.

రాము మెల్లగా నవ్వేడు.

"వాళ్ళిద్దరూ వుద్యోగాలు చేస్తుంటే, యింట్లో నిన్ను వుంచకేం జేస్తారు? తప్పకండా వుంచుతారు."

"అయినా, యిలా యెన్నాళ్ళో చెప్పు? నువ్వేమో నీ సరదాలు తీర్చుకుని వెళ్ళిపోతుంటావు, నాకేమో భయంగా వుంది రామూ! మనం పెళ్ళి చేసుకుంటే, మన కలయికలో రహస్యం యింక అవసరం వుండదుగా!" రాము కళ్ళల్లోకి చూస్తూ, గోముగా అంది, రాణి.

రాము మొహంలో కాస్తంత మార్పు వచ్చింది. కంగారుని బైటికి అగుపించనీయలేదు.

"అలాగే రాణీ! నా వుద్దేశమూ అదేను! త్వరలోనే పెళ్ళిచేసుకుందాం. మన వివాహం ఎంతో ఘనంగా జరుపుకుందాం. మన యిద్దర్నీ చూసి, అందరూ అసూయపడాలి. మన జంట చూసి అందరూ మెచ్చుకోవాలి" అంటూ ఆమెను పొదివిపట్టుకుని, మంచం మీదికి తీసుకుపోయాడు, రాము.

రాణి పరవశించి పోయింది. రాముతో పరిచయమైన తర్వాత, ఆమెకి యీ అనుభూతి అందుబాటుకి వస్తోంది. అదే ఆమెకి వల్లమాలిన తృప్తి కలిగిస్తోంది. ఈ అనుభూతిని శాశ్వతం చేసుకోవాలని, ఆమె ఆకాంక్ష! అందుకనే పెళ్ళి ప్రస్తావన ప్రతీసారీ తీసుకొస్తోంది.

కాస్సేపు వాళ్ళిద్దరూ మరో లోకంలో విహరించారు.

ఈ సందడిలో, అబ్బాయికి మందు లివ్వడం గాని, హార్లిక్స్ పట్టడం గానీ, ద్రాక్షపళ్ళు తినిపించడం గాని, ధ్యాసే లేకపోయింది, రాణికి.

రాము వెళ్ళిపోయాక, తలుపు వేసి వచ్చి, అలసటగా వుండటం వల్ల, మంచం మీద చేరబడింది రాణి. చప్పున నిద్ర పట్టేసింది. ఓ గంట తర్వాత మెలుకువ వచ్చిందామెకి. అప్పుడామెకి గుర్తు కొచ్చింది, తాను చేసిన పొరపాటేమిటి?

పక్క గదిలోకి వెళ్ళి అబ్బాయిని చూసింది. అబ్బాయి మూలుగుతున్నాడు. అతడి నుదుటి మీద చేయి వేసింది, రాణి. నిప్పు మీద చేయి పెట్టినట్టే అనిపించింది. కంగారుపడిపోయింది రాణి. ఆమె గుండెలు జోరుగా కొట్టుకున్నాయ్. ఏమీ పాలుపోలేదు. ఏదో చెయ్యాలి గనక, రెండు మాత్రలు ఒకేసారి గుండచేసి హార్లిక్స్‌లో కలిపి, అబ్బాయికి పట్టింది.

జ్వర తీవ్రతవల్ల, పట్టిన హార్లిక్స్ కడుపులో యిమడలేదు. వాంత య్యింది. రాణికి కరచరణా లాడలేదు. ఏం జరుగుతుందోనన్న భయం, ఆమెను పట్టి పీడించసాగింది. తనని పూర్తిగా విశ్వసించి వెళ్ళిన అపర్ణకి యేం సమాధానం చెప్పాలా, అని ఆలోచిస్తోంది .... మనసులానే మనిషి కూడా స్థిమితంగా వుండలేక, ఆ గదిలో పచారు చేయసాగింది.

మరి కాస్సేపటికి అపర్ణ ఒక్కర్తే వచ్చింది ఆటోలో. రాణి తలుపు తెరిచింది.

"ఎలా వుంది రాణీ?" ఇంట్లోకి అదరా బాదరాగా వస్తూనే ప్రశ్నించింది.

"జ్వర తీవ్రత అధిక మయ్యిందమ్మా. నాకేమీ పాలుపోవడం లేదు, మీకు యెట్లా కబురు చెయ్యడమా అని ఆలోచిస్తున్నాను."

అపర్ణ కొడుకు దగ్గరికి వెళ్ళింది. నుదుట మీద చెయ్యి వేసింది. నిప్పు కణం మీద చెయ్యి వేసినట్టే అనుభూతి పొందింది. ఆమె నీరై పోయింది. ఆపాదమస్తకం వణికిపోతోంది.

"మందు వేశావా?" ప్రశ్నించింది.

"వేశానమ్మా! హార్లిక్స్ ఇచ్చాను, ద్రాక్షపళ్ళు తినిపించాను. కానీ ఏమీ ఇమడ్డం లేదు. వాంతయిపోతోంది."

"అయినా, జ్వరం తగ్గలేదు. ఇప్పుడేం చెయ్యడం. బాబు కళ్ళు తేలేస్తున్నాడు ..." రుద్ధ స్వరంతో అంది అపర్ణ.

"అయ్యగారికి ఫోను చేయించేదా అమ్మా?"

"అంతవరకూ ఆగడానికి నాకు భయమేస్తోంది రాణి! తొందరగా ఆటో ఒకటి చూడు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్దాం" అంటూ మనసులో దేవుణ్ణి స్మరించుకుంది, అపర్ణ.

రాణి బైటికి పరుగెత్తింది. ఆమె మనసు మాత్రం గిల్టీగా ఫీలవుతూనే వుంది.

ఆటో వెంటనే దొరికింది. ఇంటికి తాళం వేసి. పక్కింటివారితో చెప్పి, బాబుని డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళింది అపర్ణ రాణితో పాటు.

డాక్టరు పరీక్షించాడు.

"నేనిచ్చిన మందులు మీరు వాడ్డం లేదేవిఁటండీ?" తీక్షణంగా చూస్తూ అడిగాడు.

"వాడుతున్నాం డాక్టరుగారూ! మా యింట్లో వుండే యీవిడే వేళకి మందులిస్తోంది" అంది అపర్ణ.

డాక్టరు. భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"మీరు ఉద్యోగమే ప్రధానంగా చూసుకుంటున్నారుగా! పిల్లాడిపట్ల బాధ్యత లేనట్టుంది మీకు. మీ పిల్లాడిపట్ల మీకుండే బాధ్యత, శ్రద్ధ, పరాయి వ్యక్తికి యెలా వస్తాయి చెప్పండి! ఇలా అంటున్నానని, మీరేం అనుకోకండి. అబ్బాయి చాలా ప్రమాదకర పరిస్థితిలో వున్నాడు. నా ప్రయత్నం నేను చేస్తాను. ఆ పైన దేవుడున్నాడు" అంటూ వెంటనే ఓ ఇంజక్షన్‌నిచ్చి, యింటెన్సివ్ కేర్ వార్డులో వుంచాడు అబ్బాయిని.

అపర్ణ షాక్ తిన్నది. గుండెలు అవిసేలా రోదిస్తోంది. ఆమెను అనునయించడానికి ధైర్యం చాల్లేదు రాణికి. అపర్ణలో ఆశ క్రమంగా క్షీణిస్తోంది. తాను తట్టుకోలేదేమోనన్న భయం ఆమెని ఆవరించింది.

"రాణీ, నువ్వు యింటికి వెళ్ళి, బాబుగారు రాగానే ఇక్కడికి పంపించు. నాకేం పాలుపోవడంలేదు. నువ్వు యింట్లోనే వుండు...." అంటూ రుద్ధ స్వరంతోనే రాణితో చెప్పి, ఆమెని పంపించింది.

రాణి ఆటోలో యింటికి వెళ్ళింది. అప్పుడే చంద్రం పక్కింట్లో ఆడుగుతున్నాడు.

"తొందరగా హాస్పిటల్‌కి వెళ్ళండి బాబూ. అదే రాఘవేంద్రరావు నర్సింగ్ హోమ్‌కి" అంది రాణి.

రాణి మాటల్లో ఆరాటం ధ్వనించింది.

"బాబుకి యెలా వుంది రాణీ?"

"ప్రమాదంగా ఉందనే అంటున్నాడు డాక్టరు."

"మై గాడ్...."

చంద్రం స్కూటర్ని స్టార్ట్ చేసి మెరుపులా పోనిచ్చాడు.

రాణి, తలుపు తాళం తీసి, నిస్తబ్దుగా లోపలికి వెళ్ళింది.

పక్కింటివాళ్లు తలుపు మూసేసుకున్నారు. ఎందుకో మరి. రాణిని ఏమీ ప్రశ్నించలేదు.

రాము అంతా తన గదిలోంచి గమనిస్తూనే వున్నాడు. విషయం తెలుసుకోవాలని వచ్చాడు.

"ఏమయ్యింది రాణీ?"

రాణికి దుఃఖం పెల్లుబుకొచ్చింది. "పాపిష్టిదాన్ని... బాబుకి మందు వెయ్యడం మరిచిపోయాను. ప్రమాదకరంగా వుందంటున్నాడు డాక్టరు.... ఎలా ఉంటుందో యేమో" రుద్ధ స్వరంతో అంది.

"ఈపాటి దానికే కంగారుపడితే యెలా రాణి? బావుంటుందిలే..." అన్నాడు రాము.

"ఏవిటో రామూ! నా కలా అనిపించడం లేదు. ఒకవేళ జరగ కూడనిదే జరిగితే, భగవంతుడు మనల్ని క్షమించడు.... నాకు, ఇక్కడుండడానికే భయంగా వుంది రామూ! మనం ఎక్కడైనా పారిపోదాం పద" రాము కళ్ళల్లోకి దీనంగా చూస్తూ అంది, రాణి.

రాము మొహంలో రంగు మారింది. "ఏవిటీ? నీతో నన్ను లేచి పోమంటావా? మంచిదానివే! నా ఉద్యోగం మాటేవిటి?" అయినా, నా ఆకలేదో తీర్చుకున్నాను గాని నిన్నెవరు పెళ్ళాడుతారు? అటువంటి ఆశ లేం పెట్టుకోకు" అంటూ వెనక్కి తిరిగి చరచరా బైటికి నడిచాడు రాము.

ఊహించని ఈ సంఘటనకి, రాణి నీరైపోయింది. శిలాప్రతిమలా అచేతనంగా ఉండిపోయింది. క్షణం పాటు ఆమె నయనాలు అశ్రుధారల్ని స్రవిస్తున్నాయి, చెక్కిళ్ళ మీదినుంచి. తాను మోసపోయిందన్న నిజాన్ని

అప్పుడు గ్రహించుకుంది. ఏంచెయ్యాలో ఆమెకి తోచలేదు. అనిశ్చలంగా యింట్లోనే తిరుగుతోంది.

ఓ గంట గడిచింది. ఆ గంటే ఓ యుగంలా అనిపించింది రాణికి.

పక్కింటావిడ వచ్చి చెప్పింది, బాబు చనిపోయాడని. చెప్పేసి ఆమె వెళ్ళిపోయింది.

రాణి, బావురుమంటూ కుప్పగా కూలిపోయింది. తన నిర్లక్ష్యం వల్లనే, తన మదాంధత వల్లనే ఓ నిండు ప్రాణం పోయిందని కుమిలి కుమిలి యేడ్చింది. ఆమెకి, తన జీవితంపట్ల, తన శరీరంపట్ల అసహ్యం పెరిగింది. ఆమెకింకా జీవించాలనిపించలేదు. అంతే!

రాత్రి తొమ్మిది గంటలు దాటిందప్పుడే. చంద్రం, అపర్ణ, అబ్బాయి భౌతిక కాయాన్ని తీసుకుని యింటికొచ్చారు. అపర్ణ శోక దేవతలా వుంది. తలుపు తట్టాడు చంద్రం. ఎంతసేపు తలుపు కొట్టి పిల్చినా తెరువబడలేదు. అందరికీ ఆశ్చర్యమేసింది. తలుపు బద్దలుకొట్టారు.

ఎదురుగా కనిపించిన దృశ్యం, అందర్నీ చకితుల్ని చేసింది. రాణి శవం ఫంకాకి చీరతోపాటు వేలాడబడి వుంది. చిన్న స్టూలు పక్కనే పడి వుంది.

ఎవరూ దగ్గరికి వెళ్ళలేదు. పోలీసు యినస్పెక్టరు వచ్చి శవాన్ని దింపించాడు. ఆమె చేతిలో ఓ చీటీ వుంది. దాన్ని బైటికి చదివాడు యినస్పెక్టరు.

"బాబు చావుకి నా నిర్లక్ష్యమే కారణం. నాకింక బ్రతకాలని లేదు. నా చావుకి నేనే బాధ్యురాల్ని. —రాణి."

చంద్రం, అపర్ణ మ్రాన్పడిపోయారు.

ఇనస్పెక్టరు మిగతా కార్యక్రమాలు కొనసాగించాడు.

* * *

అపర్ణ, చాలా రోజుల వరకూ మనిషవ్వలేదు. ఆ రోజు డాక్టరన్న మాటలు ఆమె చెవుల్లో యిప్పటికీ గింగురు పెడుతూనే వున్నాయి.

అపర్ణ, వుద్యోగానికి రాజీనామా యిచ్చింది. చంద్రం ఎంత చెప్పినా విన్పించుకోలేదు.

* స్వాతి, మాసపత్రిక *